

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా





సంపుటి - 07 | సంచిక 90 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 01, మార్చి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్









# కండ్లపైకెక్కిన.. కసాయితనం !

డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, ఛైర్మన్



రాజకీయంలో రాక్షసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు

రాజకీయ నాయకులు పగబట్టడానికి పేదలే దొరికారా

రాజకీయ కక్ష సాధింపులు పక్కాగా అమలు పరుచుకుంటున్నారు

పేదల ఇండ్లు కూల్చివేయడం మూర్ఖులు చేసేపని

అధికార అడ్డం పెట్టుకొని అంతులేని మోసాలు చేస్తున్నారు

దేశంలో దరిద్రాన్ని దాపురింపజేస్తున్నది ఎవరు

ఉమ్మడి రాష్ట్ర పాలనకు ప్రస్తుత పాలనకు తేడా ఏముంది

తెలుగు రాష్ట్రాల్లో ప్రజాసేవను ఆశించగలమా

కసాయితనాన్ని కండ్ల ముందే ప్రదర్శిస్తున్నది ఎవరు

రాష్ట్రాలు అప్పుల పాలవుతున్నది నాయకుల లబ్ధి కోసమా ప్రజా సేవ కోసంమా : డాక్టర్ బరిగెల శివ



హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

దేశంలో పెరిగిపోతున్న పేదరికనికి పాలకులైన నాయకుల పొగరుబోతు తనమే కారణమని డాక్టర్ బరిగెల శివ విశ్లేషించారు. పేదరిక నిర్మూలనకు పాటుపడతామంటూ సంవత్సరాలకొద్ది అధికారంలో ఉంటూ పేదరిక నిర్మూలన కోసం చేపడుతున్న అభివృద్ధి ఏంటో ప్రభుత్వాలు ఎక్కడ కనపరచకపోవడం బాధాకరమన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో పేదల ఇండ్లు కూల్చివేసే ప్రక్రియలు వేగవంతంగా జరుగుతున్నాయి తీవ్రంగా


- మిగతా 2లో..


## వికారాబాద్‌లో మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న బలిజ దివ్య

నివాసంలో ఉరివేసుకుని బలవన్మరణం

ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు


2




## జలమండలికి శారదా పీఠం భూముల కేటాయింపు

సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

పీఠానికి కేటాయించిన భూముల్లో జలమండలి నిర్మాణ పనులు చేపట్టవద్దని ఆదేశం

జలమండలికి పీఠం భూముల కేటాయింపు తక్షణమే రద్దు చేయాలన్న ముఖ్యమంత్రి

జలమండలి నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి అసహనం




2


## హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ఫ్రాడ్ కేసులో ఆస్తుల అటాచ్


2


## మక్కా యాత్ర బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు పరిహారం అందజేత

గత ఏడాది నవంబర్‌లో మృతి చెందిన 44 మంది

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందజేత

గాయపడిన వారికి రూ.3 లక్షల ద చొప్పున అందజేత




2


## పశ్చిమ బెంగాల్‌లో తాజాగా 8 లక్షల ఓట్ల తొలగింపు

66 లక్షలకు చేరిన తొలగింపు

గత సంవత్సరం 58 లక్షల ఓట్ల తొలగింపు

పరిశీలన జాబితాలో మరో 60 లక్షలకు పైగా ఓటర్లు

మరణాలు, నకిలీలు, వలసల వంటి కారణాలతో ఓట్ల తొలగింపు

పశ్చిమ బెంగాల్, జై భీమ్ న్యూస్




పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను ప్రచురించింది. పశ్చిమ బెంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్ అగర్వాల్ ప్రకారం, మొత్తం 66 లక్షల మంది ఓటర్లను తొలగించారు. గత సంవత్సరం ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసిన సమయంలో 58 లక్షల ఓట్లు తొలగించగా, ఈసారి 8 లక్షల ఓట్లను తొలగించారు. దీంతో తొలగించిన ఓటర్ల సంఖ్య 66 లక్షలకు చేరింది. అదేవిధంగా మరో 60 లక్షలకు పైగా ఓటర్లను పరిశీలన జాబితాలో చేర్చారు. ఈ ఓటర్ల వివరాలను జ్యూడిషియల్ అధికారులు తనిఖీ చేయనున్నారు. మొత్తం 7.66 కోట్లమంది ఓటర్ల జాబితాతో గత సంవత్సరం నవంబర్ 4న బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ మొదలైంది. డిసెంబర్ 16న ముసాయిదా జాబితాను విడుదల చేశారు. మరణాలు, వలసలు, నకిలీల వంటి కారణాలతో 58 లక్షల ఓట్లను తొలగించారు. దీంతో ఓటర్ల సంఖ్య 7.08 కోట్లకు తగ్గింది. విచారణలు, పరిశీలనల అనంతరం తాజాగా అదనంగా 8 లక్షల ఓట్లు తొలగించే అవకాశం ఉన్నట్లు సీనియర్ అధికారులు తెలిపారు. 7.08 కోట్ల మంది ఓటర్లలో ఇప్పటి వరకు దాదాపు 6.4 కోట్ల మందిని ఆమోదిత జాబితాలో చేర్చారు. తుది జాబితా విడుదలైన తర్వాత గణాంకాలపై నిర్ధారణకు రావొచ్చని అధికారులు వెల్లడించారు.

# మక్కా యాత్ర బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు పరిహారం అందజేత

**గత ఏడాది నవంబర్‌లో మృతి చెందిన 44 మంది**
**మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందజేత**
**గాయపడిన వారికి రూ.3 లక్షల చొప్పున అందజేత**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

గత సంవత్సరం నవంబర్‌లో మక్కా యాత్రలో జరిగిన బస్సు ప్రమాదంలో 44 మంది హైదరాబాద్ వాసులు సజీవ దహనమైన విషయం తెలిసిందే. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిహారం పంపిణీ చేశారు. 44 మంది మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం పంపిణీ చేశారు. ఈ బస్సు ప్రమాదంలో గాయపడినవారికి రూ.3 లక్షల చొప్పున సాయం అందించారు. గత సంవత్సరం నవంబర్ 17న మక్కా యాత్రలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మక్కా నుంచి బయలుదేరిన బస్సు ముందు వెళుతున్న డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ప్రమాదం జరిగింది.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ఫ్రాడ్ కేసులో ఆస్తుల అటాచ్

**సాయి సూర్య డెవలపర్స్‌కు చెందిన రూ.14.63 కోట్ల ఆస్తుల అటాచ్**
**ప్లాట్ల పేరుతో కస్టమర్లను మోసం చేసినట్లు ఆరోపణలు**
**కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి భారీగా నిధుల మళ్లింపు**
**అనుమతి లేని లేవుట్లలో ప్లాట్ల విక్రయాలు**
**మనీలాండరింగ్ చట్టం కింద దర్యాప్తు కొనసాగిస్తున్న ఈడీ**




**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ప్లాట్ల పేరుతో సామాన్యులను మోసగించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరాబాద్ జోనల్ అధికారులు కీలక చర్యలు తీసుకున్నారు. 'సాయి సూర్య డెవలపర్స్' సంస్థకు చెందిన రూ.14.63 కోట్ల విలువైన స్థిరాస్తులను మనీలాండరింగ్ నిరోధక చట్టం 2002 కింద తాత్కాలికంగా అటాచ్ చేశారు. ఈ ఆస్తుల్లో సంస్థ పేరుతో రిజిస్టర్ అయి ఉన్న పలు భూములు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. సాయి సూర్య డెవలపర్స్ ప్రొప్రైటర్ సతీష్ చంద్ర గుప్తా, మరికొందరిపై తెలంగాణ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. నిందితులు ప్రజల నుంచి డబ్బు వసూలు చేసి, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేశారని పోలీసుల చార్జిషీట్‌లో పేర్కొన్నారు. ఈడీ దర్యాప్తులో మరిన్ని సంచలన విషయాలు వెలుగుచూశాయి. సతీష్ చంద్ర గుప్తా, ఆయన అనుచరులు అనుమతులు లేని లేవుట్లను చూపించి, ఒకే ప్లాట్‌ను వేర్వేరు వ్యక్తులకు విక్రయించినట్లు తేలింది. సరైన ఒప్పందాలు లేకుండానే బాధితుల నుంచి భారీగా నగదు వసూలు చేశారు. బాధితుల నుంచి చెక్కులు, బ్యాంక్ ట్రాన్స్‌ఫర్లు, నగదు రూపంలో సేకరించిన మొత్తాన్ని నిందితులు దారి మళ్లించారు. ఈ నిధులను నేరుగా కాకుండా.. తమ కుటుంబ సభ్యులు, బినామీ సంస్థల పేర్లతో ఉన్న అనేక బ్యాంక్ ఖాతాల్లోకి మళ్లించి (లేయరింగ్) మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఈడీ గుర్తించింది. ఇలా అక్రమంగా ఆర్జించిన రూ.14.63 కోట్ల విలువైన ఆస్తులను ప్రస్తుతం ఈడీ జప్తు చేసింది. రియల్ ఎస్టేట్ రంగంలో జరుగుతున్న మోసాలను అరికట్టడంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మోసపోయిన మదుపరుల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా దర్యాప్తు కొనసాగుతోందని, ఈ నెట్‌వర్క్‌లో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో విచారణ జరుపుతున్నామని ఈడీ వర్గాలు వెల్లడించాయి.

# చంద్రగ్రహణం సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయం మూసివేత

**వేములవాడ జై భీమ్ న్యూస్**




ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేముల వాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని మార్చి 3వ తేదీ మంగళవారం రోజున మూసి వేయనున్నట్లు ఆలయ కార్య నిర్వ హణా ధికారి రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కేతుగ్రస్త చంద్ర గ్రహణం సంభవిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉదయం 6:15 నిమిషాల నుండి రాత్రి 7:15 వరకు గ్రహణ ప్రభావం ఉండనుంది. ఈ కారణంగా ఉదయం 6:15 గంటలకే ప్రధాన ఆలయం తో పాటు, అనుబంధ ఆలయాల ద్వారాలను కూడా మూసివేస్తారు. గ్రహణానికి ముందు ఆలయంలో సంప్ర దాయబద్ధంగా పూజలు నిర్వహించ నున్నారు. తెల్లవా రుజామున గం. 3:40 నుండి 4:15 వరకు సంప్రోక్షణ, మంగళ వాయి 4:15 : 4:45 వరకు సుప్రభాత , .5:00 నుండి 6:00 వరకు: ప్రాతఃకాల పూజలు, దర్శనాలు ఎప్పుడు ప్రారంభమవుతా యి. రాత్రి 7:15 గంటలకు గ్రహణ కాలం ముగిసిన తర్వాత ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం స్వామివారికి ప్రదోష పూజ, మహా నివేదన పూర్తి చేసి భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. భక్తులు ఈ మార్పును గమనించి సహకరించాలని ఆలయ అధికారులు కోరారు.

# కండ్ల "పై"కెక్కిన కసాయితనం

మొదటి పేజీ తరువాయి

హెచ్చరించారు.రాజకీయ దాహార్తి కాంట్రాక్టు పనులు అభివృద్ధి కోసం తీవ్రంగా శ్రమ పడుతున్నట్టు రాజకీయ నాయకులు అవలంబిస్తున్న విధివిధానాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయన్నారు.ప్రజల మేలు కోసం పనిచేసే నాయకులు పేదల ఇండ్లను కూల్చివేయడం ఎంతటి మూర్ఖత్వమో ఎందుకు తెలియడం లేదంటూ హెచ్చరించారు.ప్రజా ప్రతినిధులు రాజకీయ నాయకులు ప్రజలను కలవడానికి ఎక్కడలేని బందోబస్తులు ఏర్పాటు చేసుకుంటూ రాజకీయ పరిపాలనలు కొనసాగిస్తుండడం రాజకీయ నాయకుల విశ్వాసం ప్రజాసేవ పట్ల క్షీణించిపోయి అధికారపు అహంకారం కండ్ల నెత్తికెక్కినట్టుగా కనిపిస్తుందన్నారు.అన్ని రాష్ట్రాలలో ప్రభుత్వ అధికారుల తీరు బడే వింతగా తయారైందని నాయకుల కన్నా ఒక అడుగు ముందుకేస్తూ ప్రజలను అణిచివేసే బాధ్యతను మనస్ఫూర్తిగా తీసుకుంటున్నారని ఎద్దేవ చేశారు.ముందస్తు అరెస్టుల పేరుతో అణిచివేయడం హౌస్ అరెస్టులతో నిర్బంధించడం ఉద్యమకారులను బయటకు రాకుండా కట్టడి చేయడం ప్రజా సమస్యల పట్ల పోరాడుతున్న ప్రజా సంఘాలను అక్రమ కేసుల్లో ఇరికించడం ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న యువతపై దాడులు చేయించడం సోషల్ మీడియాలో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్న వ్యక్తులపై పోలీసు కేసులను కట్టించడం ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు నిర్మించుకుంటున్నారని పేదల ఇండ్లను కూల్చివేయడం ఇంచుమించు రాజకీయపు రాక్షసత్వం పెరిగిపోతున్నట్లుగా దేశ ప్రజలు భావిస్తున్నారన్నారు.దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఎక్సైజ్ శాఖ కేసును ప్రభుత్వాలు కేసు కట్టి మార్చిడిచేసుకున్న పేరు లిక్కర్ కేసుగా ప్రచారంలోనికి తీసుకొచ్చి రెండు రాష్ట్రాలను మానసికంగా వేధిస్తూ నాయకుల మనోభావాలను దెబ్బతీయటమే కాకుండా ఆత్మగౌరవాన్ని అణిచివేసి రాజకీయ అభివృద్ధిపై దాడి చేసి ప్రతిపక్ష నాయకుల చేత తండోపతండాలుగా తప్పుడు ప్రచారాలు చేయించి కేసుల్లో బాధ్యులైన వ్యక్తుల మనోభావాలను దెబ్బతీయడమే కాకుండా జైళ్ల పాలు చేసి ప్రభుత్వాలను రడగొట్టి అత్యానంద భరితులై సంతోషం పొందిన ప్రభుత్వాలు ఢిల్లీ కోర్టుగా సిబిఐ కట్టిన కేసును కొట్టివేయడంతో సమాధానం చెప్పలేక చాటు ముఖం పెట్టారన్నారు.ప్రభుత్వాలు కట్టిన కేసులను నెగ్గించుకునే కోణంలో సిబిఐ దగ్గర ఆధారాలు ఉన్నాయి అంటూ మరో ప్రచారాన్ని తెరపైకి తీసుకురావడం వినడానికి విడ్డూరంగా వికారంగా కనిపిస్తుందన్నారు.మూడు సంవత్సరాల కాలం పాటు కేసు విచారణను కొనసాగిస్తూ పురోగతిని సాధించామని చెప్పుకునే అధికార యంత్రాంగం ఢిల్లీ కోర్టులో జరిగిన ప్రధాన విచారణలో ఆధారాలను నిరూపించకపోవడం ఎంత సిగ్గుమాలిన తనమో దేశ ప్రజలు గమనించారన్నారు.దేశవ్యాప్తంగా కొత్త రకమైన రాజకీయ పరిపాలనకు ప్రభుత్వాలు తెలుపుతున్నాయని అందులో భాగంగానే ఆయా రాష్ట్రాలలో ప్రజా వ్యతిరేక కేసులు ప్రతిపక్ష నాయకులపై కదుతున్న కేసులకు ప్రభుత్వాలే కమిటీలు వేసుకొని నివేదికలు తెప్పించుకునే పరిస్థితికి దిగజారుతున్నాయని బాహాటంగా వెల్లడించారు.రాజకీయం అదుపుతప్పడానికి ప్రధాన కారణం కక్ష సాధింపు చర్యలు అవుతుండగా పరోక్ష కారణం ప్రజాప్రతినిధులు రాజకీయంగా అభివృద్ధి చెందడంతో పాటు ఆస్తులపరంగా అసాధ్యమైన సొమ్మును సంపాదించుకోవడానికి గాఢంగా ప్రయత్నిస్తున్నట్లు రాజకీయ పరిస్థితులు తెలియజేస్తున్నాయన్నారు.రాజకీయపరమైన నిందలు వేయడం రాజకీయాల్లో ప్రభుత్వ పక్షం ప్రతిపక్షం ఒకరిని ఒకరు విమర్శించుకోవడం,

తిట్టిపోసుకోవడం పురాతనం నుండి జరుగుతున్న రాజకీయాల్లో భాగమైనప్పటికీ ప్రస్తుతం కొనసాగుతున్న రాజకీయ విధానాల్లో అక్రమంగా కేసులు కట్టి జైల్లకు పంపుతూ రాజకీయంగా అణిచివేయడం ఎక్కువగా చూసుండమన్నారు.తెల్లారినది మొదలుకొని ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపులకు పాల్పడే ప్రభుత్వాలు అన్ని సరైన సమయంలో సరైన మూల్యం చెల్లించుకోక తప్పదని గుర్తు చేశారు.ఏ ప్రభుత్వమైనా ప్రజలకు గుర్తుండిపోయే సేవలు చేస్తూ ప్రజాభివృద్ధికి పాటుపడాలి గాని ప్రస్తుత ప్రభుత్వాలు పేదల జీవితాలను మాత్రమే నిర్మూలన చేసే విధంగా కఠినమైన విధివిధానాలకు పాల్పడుతూ వందల సంఖ్యలో వేల సంఖ్యలో ప్రభుత్వ అధికారులను ప్రజా అణిచివేత కోసం వాడుకుంటున్నారని హెచ్చరించారు.పరిపాలన అంశాల మీద దృష్టి పెట్టడం కన్నా పనికిమాలిన పనులపై దృష్టి పెట్టడమే ఎక్కువగా కనిపిస్తున్నట్లుగా ప్రజలందరూ భావిస్తున్నారన్నారు. ఏ సందర్భంలోనైనా సర్వసాధారణంగా ఏ రాష్ట్ర ప్రభుత్వంలోని నాయకులైన వేల కోట్ల రూపాయలను పోగు చేసుకోలేకపోతే రాజకీయ జీవితం కాదన్నట్లుగా దేశ ప్రజల సొమ్మును మింగేస్తున్నారని తీవ్రంగా మందలించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి లడ్డు విషయంలో ప్రభుత్వ ప్రజాప్రతినిధులు ముందొకలాగా సుప్రీంకోర్టు కేసును కొట్టేసి ఇచ్చిన తీర్పు తదుపరి మరోలాగా రాజకీయ స్వరాలు మారుస్తుండడం చివరకు దేవుళ్లను కూడా రాజకీయాలకు వాడుకునే పద్ధతులను పాటిస్తుండడం రాజకీయ వికృత నేర్పరిచేష్టలకు పరాకాష్టగా పరిగణించాల్సి ఉంటుందన్నారు.విద్య విధానంపై వైద్య విధానంపై ఉపాధి విధానంపై ప్రజా సంక్షేమ అభివృద్ధి విధానంపై ప్రభుత్వాలు అనుకున్న స్థాయిలో మనసు కేంద్రీకరించలేకపోతున్నాయని వాటిని బట్టి చూస్తే రాజకీయ నాయకులు అహంకారం రాజకీయ నాయకులు ప్రభుత్వ అధికారం కండ్లకెత్తినట్టుగా కనిపిస్తుందని ఘాడంగా విమర్శించారు.పేదరికం అనుభవిస్తూ రాజకీయంగా ఎదిగామని చెప్పుకుంటూనే పేదల ఇండ్లను పూర్తిగా కూల్చివేసే వికృత రాజకీయాలు చివరకు పేదలను ఎటువైపు నెట్టుతాయో తెలియదు గానీ రాజకీయ కక్ష సాధింపులో భాగంగా ప్రతిపక్షాలకన్న పేదలే ఎక్కువగా నలిగిపోతున్నారన్నమాట వాస్తవమన్నారు.కేంద్రంతో దోస్తీ కదుతున్న ప్రభుత్వాలన్ని కేంద్రం అవలంబిస్తున్న విధానాలనే రాష్ట్రాల్లో అవలంబిస్తూ పేదల సంక్షేమాలను పక్కన పెడుతున్నారని దేశంలో ఎక్కడ చూసినా ప్రభుత్వాలు పాటిస్తున్న పరిపాలనలు అంటేనే కాంట్రాక్టు టెండర్ల విధానం, పారిశ్రామిక అభివృద్ధి విధానం అనే ద్వంద పద్ధతులను ప్రతి రాష్ట్రం వాళ్ళు తూచా తప్పకుండా పాటిస్తూ వాళ్లు పాలిస్తున్న పాలనలో పక్కాగా అమలుపరచుకుంటూ ప్రజా సొమ్మును దుర్వినియోగ పాలు చేయడమే కాకుండా పేద ప్రజల ఆస్తులను పూర్తిగా ధ్వంసం చేస్తున్నారని తీవ్రంగా హెచ్చరించారు. ఏ నాయకుడైనా అబద్ధాలు ఆడే ముందు వాళ్ల వ్యక్తిగతమైన మనస్సాక్షి ఒకటి ఉంటుందని దాన్ని కూడా చంపుకొని బరితెగించి అబద్ధాలు ఆడితే దాన్ని రాజకీయ జీవితం అంటారో రాజకీయ వ్యభిచారం అంటారోవాటిని పాటిస్తున్న ప్రజాప్రతినిధులే గమనించాలన్నారు.మోసాలు చేయడం ఒకెత్తైతే బరితెగించి మోసాలు చేయడం మరొక్కెత్తు లాగా భావించాల్సి ఉంటుందని ప్రతి నాయకుడు గమనించాలన్నారు.ప్రజలకు మేలు చేయలేని, ప్రజా సంక్షేమాలను అమలుపరచలేని ప్రజాప్రతినిధులు పనికిమాలిన విధివిధానాలను పాటిస్తూ ప్రజల ముందు గొప్ప హీరోలుగా చెప్పుకుంటున్నారని అది ఎంతటి సిగ్గుమాలినతనమో అలా ప్రవర్తిస్తున్న నాయకులు ఒకటికి వందసార్లు ఆలోచించుకోవాలన్నారు.

రాజకీయ నాయకుల చుట్టుపక్కలున్న చెంచాగిరిదారులే ప్రజా వేధింపులకు ప్రజల అణిచివేతకు, సాధారణ ప్రజల జీవన విధానాలను అభివృద్ధి విరోధానికి తీవ్రంగా ప్రయాస పడుతున్నారని అట్టి ప్రయాసలు సామాన్య ప్రజాప్రతినిధి, సామాన్య నాయకులతో మొదలుకొని ఉన్నతమైన ప్రజాప్రతినిధులు ఉన్నతమైన నాయకుల వరకు మిళితమై పోతూ ప్రజాసంక్షేమాలను పాతరేస్తూ వ్యక్తిగత సంక్షేమలను అభివృద్ధి పరచుకుంటున్నారని ఘాటుగా హెచ్చరించారు.దేశవ్యాప్తంగా కండ్లు నెత్తినెక్కిన ఏ రాజకీయ నాయకుడైన ప్రజాసేవ పట్ల తీవ్ర వ్యతిరేకమైన పేరును సంపాదించుకుంటూ పేద ప్రజల అభివృద్ధికి విరోధిగా పేరుగాంచుతారన్నది మాత్రం పక్కా నిజమన్నారు.

# పింగిళిలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు




**హన్మకొండ, 28 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (అటానమస్)లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. కళాశాలలోని అన్ని సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో వివిధ శాస్త్రీయ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ సైన్స్ విభాగాలకు చెందిన విద్యార్థినులు తమ ప్రయోగాలను పోస్టర్ ప్రెజెంటేషన్ రూపంలో ప్రదర్శించారు. అదేవిధంగా క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించగా, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. వారు స్వయంగా రూపొందించిన పలు లైవ్ మోడల్స్‌ను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ , వరంగల్ లో కెమికల్ టెక్నాలజీ విభాగ ప్రొఫెసర్ ఆనంద్ కిషోర్ కోలా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం వేద కాలం నుంచే సైన్స్, టెక్నాలజీ రంగాలలో ముందంజలో ఉందని పేర్కొన్నారు. శాస్త్ర సాంకేతిక రంగంలో భారతీయులు విశేష ప్రతిభ కనబరుస్తున్నారని, ఆ సంప్రదాయాన్ని ప్రస్తుత తరం మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి జాతీయ సైన్స్ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, విద్యార్థినులు పరిశోధనలను లక్ష్యంగా చేసుకొని ముందుకు సాగాలని సూచించారు. పరిశోధనల ద్వారా వ్యక్తిగత అభివృద్ధితో పాటు దేశ ప్రగతికి తోడ్పడవచ్చని తెలిపారు. పింగిళి కళాశాలలో విద్యార్థినుల పరిశోధన ఆసక్తిని పెంపొందించే విధంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కళాశాల రీసెర్చ్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. ప్రశాంతి మాట్లాడుతూ, కళాశాలలో పరిశోధనా రంగంలో సాధించిన మైలురాళ్లను వివరించారు. రాష్ట్ర స్థాయిలో పరిశోధన విషయంలో పింగిళి కళాశాల రెండవ స్థానంలో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని సైన్స్ విభాగాధిపతులు, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థినుల్లో శాస్త్రీయ దృక్పథం మరియు పరిశోధనా ఆసక్తిని పెంపొందించాయి.

# జలమండలికి శారదా పీఠం భూముల కేటాయింపు

**సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు**
**పీఠానికి కేటాయించిన భూముల్లో జలమండలి నిర్మాణ పనులు చేపట్టవద్దని ఆదేశం**
**జలమండలి నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి అసహనం**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

కోకాపేటలోని శారదా పీఠానికి కేటాయించిన భూమికి సంబంధించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. శారదా పీఠానికి కేటాయించిన ఈ భూముల్లో జలమండలి నిర్మాణ పనులు చేపట్టవద్దని ఆదేశించారు. జలమండలికి శారదా పీఠం భూముల కేటాయింపు తక్షణమే రద్దు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శారదా పీఠం భూములను జలమండలికి కేటాయించడంతో అక్కడ నిర్మాణ పనులు చేపట్టారు. జలమండలి నిర్మాణ పనులను శారదా పీఠం ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా, అధికారులపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. పీఠం భూములను జలమండలికి కేటాయించిన సమయంలో అక్కడి నిర్మాణాల స్థితిని తెలియజేయకపోవడాన్ని ప్రశ్నించారు. జలమండలికి ఈ భూకేటాయింపులను రద్దు చేసి, శారదా పీఠానికే ఆ భూములు కొనసాగేలా ఆదేశించారు.

# వికారాబాద్‌లో మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

**కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న బలిజ దివ్య**
**నివాసంలో ఉరివేసుకుని బలవన్మరణం**
**ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు**

**వికారాబాద్, జై భీమ్ న్యూస్**

వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఓ మహిళా పోలీస్ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది. పట్టణంలోని గంగారాం సాయి బాబా కాలనీలో నివాసం ఉంటున్న బలిజ దివ్య (27) ఇవాళ తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే... బలిజ దివ్య కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ధరూర్ సీఐ కార్యాలయానికి అటాచ్‌గా పనిచేస్తున్నారు. శనివారం తెల్లవారుజామున ఆమె ఉరివేసుకుని ఉండటాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వికారాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కానిస్టేబుల్ దివ్య ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబ కలహాల వల్ల ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారా? లేక విధి నిర్వహణలో ఏమైనా ఒత్తిళ్లు ఉన్నాయా? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. పూర్తి దర్యాప్తు తర్వాత మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem



# రామ్‌నగర్ షైన్ పాఠశాలలో సైన్స్ సంబరాలు





### సి.వి. రామన్ జయంతి సందర్భంగా విద్యార్థుల వినూత్న ప్రదర్శనలు

**హన్మకొండ, 28 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

భారత ప్రఖ్యాత శాస్త్రవేత్త సి.వి. రామన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను హనుమకొండలోని రామ్ నగర్ షైన్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్పో విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకతకు వేదికగా నిలిచింది. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో విద్యార్థులు భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవ శాస్త్రం, వృక్ష శాస్త్రాలకు సంబంధించిన అనేక ప్రాజెక్టులను ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణ, గ్రీన్ ఎనర్జీ, జల సంరక్షణ, సౌరశక్తి వినియోగం, స్మార్ట్ సిటీ నమూనాలు, ఆటోమేటిక్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్స్, మానవ శరీర నిర్మాణ నమూనాలు వంటి విభిన్న అంశాలపై రూపొందించిన నమూనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తమ ప్రాజెక్టుల వెనుక ఉన్న శాస్త్రీయ సూత్రాలను స్పష్టంగా వివరించి ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే కాలంలో ప్రపంచ అభివృద్ధి మొత్తం సైన్స్ మరియు టెక్నాలజీ ఆధారంగానే కొనసాగుతుందని తెలిపారు. సైన్స్‌ను కేవలం పాఠ్యాంశంగా కాకుండా జీవిత విధానంగా స్వీకరించాలని విద్యార్థులకు సూచించారు. సైన్స్‌ను మంచికి వినియోగిస్తే సమాజానికి శ్రేయస్సు కలుగుతుందని, చెడు ప్రయోజనాల కోసం వాడితే అది మానవాళికే ప్రమాదమవుతుందని హెచ్చరించారు. షైన్ విద్యాసంస్థల డైరెక్టర్ మూగల రామకుమార్ మాట్లాడుతూ, చిన్ననాటి నుంచే శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా, ఇంజినీర్లుగా, వైద్యులుగా ఎదగగలరని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రగతి రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లో పరిశోధనా స్వభావం పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. శాస్త్రీయ ఆవిష్కరణలకు ప్రాధాన్యతనిచ్చే దిశగా నిర్వహించిన ఈ సైన్స్ ఎక్స్పో విజయవంతంగా ముగిసింది.

# స్వామి కార్యము స్వకార్యంగా హరీశ్ రావు పర్యటన

### వరంగల్ ప్రజలను ఇంకా ఎన్ని సార్లు మోసం చేస్తారు?: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఘాటు విమర్శలు

**కాజీపేట, 28 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

కాజీపేట పర్యటనకు వచ్చిన హరీశ్ రావుపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసం "స్వామి కార్యము స్వకార్యంగా" పర్యటనలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించడం హాస్యాస్పదమని ఆయన విమర్శించారు. గత పదేళ్లలో బీజేపీ--బీఆర్ఎస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పటికీ కాజీపేట అభివృద్ధి దిశగా ఒక్క కీలక నిర్ణయం కూడా తీసుకోలేదని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ అంశాన్ని ప్రస్తావిస్తూ, మీ పాలనలో చేసింది శూన్యమని ఘాటుగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి పొన్నాల లక్ష్మయ్య రూ.20 కోట్లు మంజూరు చేసి, 54 ఎకరాల స్థలాన్ని కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం సేకరించారని గుర్తుచేశారు. సీనియర్ శాసనసభ్యుడిగా ఉన్న హరీశ్ రావు దుష్ప్రచారాలు చేయడం సరికాదని, గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు కేంద్రంతో సమన్వయం చేసి ప్రాజెక్టులను సాధించలేదని ప్రశ్నించారు. 15 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్న మాజీ నేతలు కాజీపేటకు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలని సవాల్ విసిరారు. దేశవ్యాప్తంగా అమలైన నోట్ల రద్దు, జీఎస్టీ పన్ను, వ్యవసాయ చట్టాలకు మద్దతుగా అసెంబ్లీలో తీర్మానాలు చేసినవారు మీరే కాదా అని నిలదీశారు. విభజన చట్టంలో సోనియా గాంధీ పొందుపరిచిన హామీలను అమలు చేయించడంలో విఫలమయ్యారని విమర్శించారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, ట్రైబల్ యూనివర్సిటీ వంటి ప్రధాన హామీలపై పదేళ్లలో ఒక్కరోజైనా కేంద్రంతో మాట్లాడారా అని ప్రశ్నించారు. కాజీపేటకు 30 పడకల ఆసుపత్రి అవసరం ఉన్నప్పటికీ కనీస ప్రయత్నం చేయలేదని విమర్శించారు. రైల్వే ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికంగా అన్ని వర్గాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ఇప్పుడు కార్మికుల పక్షాన పోరాటం చేస్తున్నట్లు నటించడం ప్రజలకు నమ్మశక్యం కానిదని అన్నారు. చేసే అవకాశం ఉండి చేయకుండా కాలయాపన చేసిన నేతలు ఇప్పుడు ధర్నాలు చేయడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. వరంగల్ ప్రజలు మీ పర్యటనలు, నిరసనలు చూస్తూ నవ్వుకుంటున్నారని, ప్రజల తీర్పు మీకు ఇప్పటికే స్పష్టమైందని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 స్థానాల్లో 11 స్థానాలను కాంగ్రెస్ పార్టీకి ఇవ్వడం ద్వారా ప్రజలు తమ అభిప్రాయాన్ని వెల్లడించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాజీపేట బస్ స్టాండ్ నిర్మాణానికి స్థల కేటాయింపు, మధ్యలో ఆగిపోయిన కాజీపేట ఆర్ఓబీ పూర్తి, నగర మాస్టర్ ప్లాన్ అమలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు, విమానాశ్రయం నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. వరంగల్ ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.




# మడికొండలో డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై విస్తృత అవగాహన కార్యక్రమం





### అరైవ్ అలైవ్ 2వ దశలో భాగంగా చైతన్య ర్యాలీ

**మడికొండ, 28 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్):**

రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా పోలీసులు చేపట్టిన అరైవ్ అలైవ్ ప్రచార కార్యక్రమం రెండో దశలో భాగంగా మడికొండలోని టి.ఎస్.డబ్ల్యూ.ఆర్.జె.సి బాయ్స్ కళాశాలలో డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మడికొండ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది నిర్వహించారు. ప్రచార కార్యక్రమం ఐదవ రోజు షెడ్యూల్‌లో భాగంగా విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలు, డిఫెన్సివ్ డ్రైవింగ్ విధానాల ప్రాముఖ్యతపై సమగ్రంగా వివరించారు. వాహనం నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎదురయ్యే ప్రమాదాలను ముందుగానే అంచనా వేసే విధానం, ఇతరుల నిర్లక్ష్యాల వల్ల కలిగే ప్రమాదాలను ఎలా నివారించాలి వంటి అంశాలపై ప్రాక్టికల్ ఉదాహరణలతో అవగాహన కల్పించారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ అనేది కేవలం వాహనం నడపడం మాత్రమే కాకుండా అప్రమత్తత, సహనం, నియంత్రణతో వ్యవహరించడం అని తెలిపారు. హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ వినియోగం, వేగ పరిమితులను పాటించడం, మొబైల్ ఫోన్ వినియోగాన్ని పూర్తిగా నివారించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదనే అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. "డూ'స్ అండ్ డోంట్'స్"పై వివరించడంతో పాటు ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సూచికల అర్థాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానంపై సూచనలు ఇచ్చారు. యువత రోడ్డు భద్రతపై బాధ్యతాయుతమైన దృక్పథం కలిగి ఉండాలని, ఒకరి నిర్లక్ష్యం అనేక కుటుంబాలను దుఃఖంలో ముంచుతుందని ఎస్‌హెచ్ఓ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోలీసుల సూచనలను శ్రద్ధగా విన్నారు. అనంతరం విద్యార్థులు తమ సందేహాలను అడిగి స్పష్టత పొందారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో అవగాహన కార్యక్రమాలు కీలకమని, భవిష్యత్తులో కూడా పాఠశాలలు, కళాశాలల్లో ఇటువంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని మడికొండ ఎస్‌హెచ్ఓ తెలిపారు. యువతలో ట్రాఫిక్ నియమాలపై చైతన్యం పెంపొందించడమే అరైవ్ అలైవ్ ప్రచార లక్ష్యమని పేర్కొన్నారు.

## హసన్‌పర్తి మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన జెడ్పీ సీఈఓ

### అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతిపై సమీక్ష



**హసన్ పర్తి, 28 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లా ప్రజా పరిషత్ హనుమకొండ ప్రధాన కార్యనిర్వాహణ అధికారి (సీఈఓ) శనివారం హసన్‌పర్తి మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు పురోగతిపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. మండలంలోని గ్రామపంచాయతీల్లో చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి పనులు, పల్లె ప్రగతి, శుచిత కార్యక్రమాలు, తాగునీటి సరఫరా, రోడ్ల నిర్మాణం వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు సమయానికి చేరుతున్నాయా అనే విషయాన్ని వివరంగా తెలుసుకున్నారు. పనుల అమలులో ఆలస్యం లేకుండా, నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు సీఈఓ సూచించారు. ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించేందుకు సమన్వయంతో పని చేయాలని, గ్రామస్థాయిలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. మండల అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సీఈఓ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుమనావాణి, సూపరేండెంట్ సురేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జులైవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్




**హన్మకొండ, 28 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జులైవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ విజ్ఞాన ప్రదర్శనలో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ స్వయంగా రూపొందించిన వివిధ సైన్స్ నమూనాలు, ప్రయోగాలు, సాంకేతిక ఆవిష్కరణలను ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణ, పునరుత్పాదక శక్తి వనరులు, నీటి సంరక్షణ, స్మార్ట్ వ్యవసాయం, సైన్స్ ఆధారిత దైనందిన జీవిత ఉపకరణాలు వంటి పలు అంశాలపై విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. చిన్నారుల్లోని సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం, శాస్త్రీయ ఆలోచన విధానం స్పష్టంగా కనిపించాయి. ఈ సైన్స్ ఫెయిర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులలో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి పాఠశాల స్థాయిలో నిర్వహించే సైన్స్ ఫెయిర్లు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. శాస్త్రీయ దృక్పథం పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. సైన్స్ ఉపాధ్యాయులు సత్యనారాయణ విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ ప్రతి నమూనా వెనుక ఉన్న శాస్త్రీయ సూత్రాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, బీఈడీ కళాశాల మరియు డైట్ కళాశాల చాత్రోపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. సైన్స్ ఫెయిర్ పాఠశాల వాతావరణాన్ని విజ్ఞానోత్సవంగా మార్చి విద్యార్థుల్లో శాస్త్రంపై ఆసక్తిని మరింత పెంచింది.

# వేములవాడ పీఎంశ్రీ పాఠశాల సందర్శన

### విద్యార్థుల ప్రతిభను అభినందించిన కేంద్ర జాయింట్ సెక్రటరీ ప్రవీర్ కుమార్



**వేములవాడ జై భీమ్ న్యూస్**



వేములవాడ పట్టణంలోని పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం పీఎంశ్రీ నోడల్ అధికారి, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్, అర్బన్ ఎఫైర్స్ జాయింట్ సెక్రటరీ ప్రవీర్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పీఎంశ్రీ పథకం కింద అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ఆయన ఆసక్తిగా తిలకించారు. విద్యార్థులను కేవలం పాఠ్యాంశాలకే పరిమితం చేయకుండా, అన్ని రంగాల్లో ఉత్తమ ప్రతిభ చూపేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన స్కౌట్స్ అండ్ గైడ్స్, కరాటే, యోగా ప్రదర్శనలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో రాణించేలా తగిన ప్రోత్సాహం అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, పాఠశాల విద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనార్దన్ రావు, సమగ్ర శిక్ష రాష్ట్ర కోఆర్డినేటర్ విక్రమ్ రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ దబ్బెడ హన్మండ్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారత్నం తదితరులు పాల్గొన్నారు..

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

# శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవంలో భక్తి పారవశ్యం

**పాల్గొన్న వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య**
**ఆలయ అభివృద్ధికి సహకారం హామీ**





**చిల్పూర్, 28 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్))**

చిల్పూర్ మండల కేంద్రంలోని చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన స్వామివారి కల్యాణ మహోత్సవం ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా జరిగింది. ఈ మహోత్సవానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆలయానికి విచ్చేసిన ఎంపీకి అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవ వేడుకలను భక్తులతో కలిసి తిలకిస్తూ ఆధ్యాత్మిక సేవలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా, వేడుకలు సంప్రదాయబద్ధంగా, వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. చిల్పూర్ గుట్ట ఆలయం కేవలం ప్రాంత ప్రజలకే కాకుండా పరిసర జిల్లాల భక్తులకు కూడా ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోందని పేర్కొన్నారు. భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించేందుకు, ఆలయ అభివృద్ధి పనులకు అవసరమైన సహకారం అందించేందుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే బ్రహ్మోత్సవాల నిర్వహణలో పాలుపంచుకున్న అర్చకులు, దేవస్థాన కమిటీ సభ్యులు, అధికారులు అందరినీ అభినందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణోత్సవాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈ.ఓ లక్ష్మీ ప్రసన్న, దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ధర్మకర్త మండలి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వాహనాలు నడిపే డ్రైవర్లకు కంటిచూపే అత్యంత కీలకం

**జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్**



**మహబూబాబాద్. జై భీమ్ న్యూస్**

వాహనాలను నడిపే ప్రతి డ్రైవర్‌కు స్పష్టమైన కంటిచూపు అత్యంత అవసరమని, కంటిచూపు లోపాలు రోడ్డు ప్రమాదాలకు ఒక ప్రధాన కారణమని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ తెలిపారు. శనివారం కేసముద్రం మండల కేంద్రంలోని హరిహర గార్డెన్‌లో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా పోలీస్ శాఖ చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా అగర్వాల్ హాస్పిటల్ సౌజన్యంతో లారీ, ఆటో, డీసీఎం, గ్రామపంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ డా. శబరీష్ కంటి పరీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, డ్రైవర్లు తమ కంటి చూపును తరచుగా పరీక్షించించుకోవడం ద్వారా కంటి సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. వాహనాలను నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అధిక వేగం, నిర్లక్ష్యపు మరియు ర్యాష్ డ్రైవింగ్‌ను పూర్తిగా నివారించాలని హెచ్చరించారు. అలాగే వాహనాలలో అధిక లోడ్‌తో ప్రయాణించడం ప్రమాదాలకు దారితీస్తుందని తెలిపారు. ప్రత్యేకంగా లారీ డ్రైవర్లు మరియు ఎక్కువ దూరం వాహనాలు నడిపే డ్రైవర్లు నిద్రమత్తు వచ్చినప్పుడు వెంటనే వాహనాన్ని సురక్షిత ప్రదేశంలో ఆపి కొంతసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత మాత్రమే ప్రయాణాన్ని కొనసాగించాలని సూచించారు. అలసటతో లేదా నిద్రమత్తులో వాహనం నడపడం తీవ్రమైన ప్రమాదాలకు కారణమవుతుందని హెచ్చరించారు. ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ జర్నలిస్టులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ అడ్మిన్ గంద్రతి మోహన్,కేసముద్రం సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు క్రాంతి కిరణ్, రమేష్ బాబు, కరుణాకర్, నరేష్ మరియు పోలీస్ సిబ్బంది, డా. అగర్వాల్స్ వైద్య సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

# టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో టోల్ ఫ్రీ సేవలు విస్తరణ

**విద్యుత్ వినియోగదారులకు 24/7 అందుబాటులో 1912**
**సాంకేతికతతో సత్వర ఫిర్యాదుల పరిష్కారం**

**ములుగు, 28 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

టీజీఎన్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు టోల్ ఫ్రీ సేవలను విస్తరించినట్లు ములుగు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఏ. ఆనందం తెలిపారు. సంస్థ పరిధిలోని 17 సర్కిళ్ల వినియోగదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తూ అదనపు సిబ్బందిని నియమించడం ద్వారా టోల్ ఫ్రీ సేవలను మరింత పటిష్టపరిచామని తెలిపారు. 24 గంటలూ అందుబాటులో ఉండే టోల్ ఫ్రీ నంబర్ 1912 ద్వారా వినియోగదారులు తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని వెల్లడించారు. ఇకపై సంస్థ పరిధిలో ఏర్పాటు చేసే ప్రతి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌పై 1912 నంబర్ ముద్రించి ఉంటుందని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్లు, విద్యుత్ సరఫరా అంతరాయాలు, బిల్లుల్లో ఉన్న హెచ్చుతగ్గులు, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, విద్యుత్ మీటర్ల మార్పు, కొత్త సర్వీసుల మంజూరు, పేరు మార్పు, కేటగిరీ మార్పు, లోడ్ మార్పు తదితర సమస్యల పరిష్కారానికి వినియోగదారులు 1912ను సంప్రదించాలని సూచించారు. వినియోగదారుడు 1912కు ఫోన్ చేసిన వెంటనే ఫిర్యాదు నమోదు చేయబడుతుంది. ఆ వివరాలు సంబంధిత అధికారికి తక్షణమే పంపబడతాయి. అదే సమయంలో ఫిర్యాదు దారునికి ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందజేస్తారు. అనంతరం సంబంధిత అధికారి ఫిర్యాదును పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. 1912కు వచ్చిన ఫిర్యాదులను ఉన్నతస్థాయి అధికారులు నిరంతరం సమీక్షిస్తారని, ఈ సమీక్షల ద్వారా ఫిర్యాదుల త్వరిత పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వినియోగదారుల అభిప్రాయాలను సేకరిస్తూ సేవల మెరుగుదలపై చర్యలు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ 1912 ఎంతో దోహదపడుతుందని సూపరింటెండింగ్ ఇంజనీర్ ఏ. ఆనందం వివరించారు.




# మహేశ్వరం ప్రభుత్వ పాఠశాలలో అనుమానాస్పద ఘటన కలకలం

**విద్యార్థుల్లో భయాందోళన**



**నర్సంపేట, ఫిబ్రవరి 28 (జై భీమ్ న్యూస్)**

నర్సంపేట పరిధిలోని మహేశ్వరం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా పూజలు నిర్వహించినట్లు కనిపించడం కలకలం రేపింది. శనివారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో కొన్ని పూజా సామగ్రి, నిమ్మకాయలు, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ చల్లిన ఆనవాళ్లు గమనించి భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఘటనతో విద్యార్థుల్లో ఆందోళన వాతావరణం నెలకొంది. కొంతమంది విద్యార్థులు భయంతో పాఠశాలకు రాకుండా ఉన్నారని ఉపాధ్యాయులు తెలిపారు. ఇలాంటి చర్యలు చిన్నారుల మనోభావాలపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు వారి చదువులకు ఆటంకం కలిగించే అవకాశముందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల సిబ్బంది వెంటనే గ్రామ పెద్దలకు, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన ఉపాధ్యాయులు ఇది ఎవరి పనో గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. విద్యార్థుల భద్రతకు ఎటువంటి ముప్పు లేకుండా పాఠశాల వాతావరణాన్ని ప్రశాంతంగా ఉంచాల్సిన బాధ్యత అందరిదని వారు పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా ఈ ఘటనపై ఆందోళన వ్యక్తం చేస్తూ, పాఠశాలల్లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్థులు ఈ ఘటన వెనుక ఉన్నవారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై స్థానిక అధికారులు దర్యాప్తు చేపట్టి పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది. విద్యార్థులలో నెలకొన్న భయాన్ని తొలగించేందుకు పాఠశాల యాజమాన్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం.

# ద్రవిడియన్ పొలిటికల్ సైన్స్ అసోసియేషన్ (డిపిఎస్ఎ) ప్రథమ వార్షిక సదస్సు

**రెండు రోజుల జాతీయ సదస్సు - బ్రోచర్ విడుదల**



**హన్మకొండ, 28 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

ద్రవిడియన్ పొలిటికల్ సైన్స్ అసోసియేషన్ (ఐ४ూఊూ) ఆధ్వర్యంలో ప్రథమ వార్షిక సదస్సు మరియు రెండు రోజుల జాతీయ సదస్సును "ద్రవిడియన్ సమాజము రాజకీయాలు" అనే ప్రధాన అంశంపై మే 9, 10 తేదీలలో ఆన్లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ జాతీయ సదస్సు ద్రవిడియన్ ప్రాంత రాజకీయ పరిణామాలు, సామాజిక మార్పులు, ప్రాంతీయ రాజకీయాలపై సమగ్ర చర్చలకు వేదిక కానుంది. ముఖ్యంగా ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, పాండిచ్చేరి, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల రాజకీయ పరిస్థితులు, అలాగే భారత ఉపఖండం మరియు ప్రపంచ దేశాలతో ద్రవిడియన్ ప్రాంత రాజకీయ సంబంధాలపై ఐదు విభాగాలుగా చర్చలు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను రాజనీతి శాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో ఘనంగా విడుదల చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ నాగరాజు వాడపల్లి మాట్లాడుతూ, ద్రవిడియన్ రాజకీయాలపై శాస్త్రీయ దృక్పథంతో చర్చించేందుకు ఈ సదస్సు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ప్రాంతీయ రాజకీయాలపై లోతైన అధ్యయనాలు, పరిశోధనలు ప్రోత్సహించడమే ఈ సదస్సు లక్ష్యమని పేర్కొన్నారు. జనరల్ సెక్రటరీ డాక్టర్ పాలమాకుల కొమురయ్య మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల నుండి అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కోశాధికారి కల్లేపల్లి ప్రశాంత్ సదస్సు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్ల వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక సభ్యులు డాక్టర్ సంకేనేని వెంకటయ్య, గుండు సురేష్, లీలావతి బిట్టా, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ గడ్డం కృష్ణయ్య, డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ, పరిశోధకురాలు రుబీన, రాజనీతి శాస్త్ర విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ద్రవిడియన్ రాజకీయాలపై అకాడెమిక్ వేదికగా ఈ జాతీయ సదస్సు విశిష్ట స్థానాన్ని సంపాదించనుందని నిర్వాహకులు విశ్వాసం వ్యక్తం చేశారు.

# నర్సంపేట మైనార్టీ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో స్ఫూర్తి సైన్స్ ఫెయిర్ ప్రారంభం

**వరంగల్, 28 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ వరంగల్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు శనివారం నర్సంపేటలోని మైనార్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికలు)లో నిర్వహించిన "స్ఫూర్తి" కార్యక్రమం -- సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు భావి భారత పౌరులని, వారి శారీరక--మానసిక ఆరోగ్యం, శాస్త్రీయ దృక్పథం, ఆర్థిక అవగాహన, పౌష్టికాహార అలవాట్లు వంటి అంశాలపై చిన్ననాటి నుంచే అవగాహన పెంపొందించుకుంటేనే మంచి పౌరులుగా తీర్చిదిద్దబడతారని తెలిపారు. స్వీయ అవగాహన, నైపుణ్యాభివృద్ధి, తోటి వారిపై సానుభూతి, సమస్యల పరిష్కార దిశగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం విద్యార్థుల్లో పెరగాలని సూచించారు. భావవ్యక్తీకరణ సరళంగా ఉండటంతో పాటు సృజనాత్మకత, తర్కబద్ధమైన ఆలోచన శక్తి అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం అభినందనీయం అని తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి సాధించినప్పుడే దేశం సమగ్రంగా ఎదుగుతుందని ఆయన వివరించారు. డిప్యూటీ మాస్ మీడియా అధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో ప్రభావం చూపిన మహనీయుల జీవిత చరిత్రల నుండి స్ఫూర్తి పొందాలని, ఈ వయసులోనే స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని కుటుంబం, దేశ బాధ్యతల్లో భాగస్వాములు కావాలని సూచించారు. పరీక్షలు లేదా వ్యక్తిగత సమస్యల విషయంలో మానసిక ఒత్తిడికి లోనుకాకుండా, ఉద్వేగానికి గురికాకుండా ప్రతి సమస్యకు పరిష్కార మార్గం వెతుక్కోవాలని కోరారు. విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితుల సలహాలు తీసుకుంటూ సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు కృషి చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "టెలి--మనస్" కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మానసిక కౌన్సిలింగ్ అందుబాటులో ఉందని, అవసరమైతే 14416 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని తెలియజేశారు. కార్యక్రమం అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గౌరవ అతిథులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీపాల్, ఉపాధ్యాయులు, సీసీ నాగరాజు తదితరులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.





జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా



# సమాజం మేలుకొలుపులో జర్నలిజం పాత్ర కీలకం

**జర్నలిజం సమాజాన్ని ప్రతి బింబిస్తుంది**
**సేవాతత్పరులు జర్నలిజానికి అంకితపరులు**
**జర్నలిజం అనేది ప్రజా ఆత్మ గౌరవాన్ని బలపరుస్తుంది**
**క్షీణిస్తున్న విలువలను అదిమి పట్టుకుని కాపాడేదే జర్నలిజం**
**వ్యక్తిగత బాధ్యత కుటుంబ బాధ్యత సమాజ బాధ్యత**
**జర్నలిజానికి కత్తి మీద సాములంటివి**
**జర్నలిస్టులు అన్ని విధాల మెలుకువలు అభివృద్ధి పరచుకోవాలి**
**కేయూ సీనియర్ పాలకమండలి సభ్యులు ఆచార్య సురేష్ లాల్**




**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్:-**

నిజమైన జర్నలిజం ఎంతటి కష్టమైన ఎదుర్కొని సమాజాన్ని మేలుకొలుపుతుందని దూరవిద్య కేంద్ర డైరెక్టర్, సోషల్ సైన్స్ డీన్,కేయూ సీనియర్ పాలకమండలి సభ్యులు ఆచార్య సురేష్ లాల్ అన్నారు.సమాజంలో జర్నలిజం విలువలు తగ్గకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి జర్నలిస్టుపై ఉంటుందని గుర్తుకు చేశారు.ప్రభుత్వ ఆస్తులను కాపాడడంలో క్రియాశీలక పాత్ర పోషించాల్సిన బాధ్యత జర్నలిస్టుల భుజస్కాంతాలపై ఉంటుందని గుర్తు చేశారు.కొన్ని సందర్భాల్లో సమాజం జర్నలిస్టులను చిన్నచూపు చూస్తున్నప్పటికిని ఆత్మవిశ్వాసం కోల్పోకుండా పనిచేయగల జర్నలిజాన్ని శాశ్వతంగా నిలబెట్టుకోగలడం కోసం పరితపించాలన్నారు. ప్రభుత్వాలను ప్రజాసేవ కోసం ఆయాత్తపరచాల్సిన సందర్భాల్లో జర్నలిజం కలానికి పదును పెడుతుండడంతో పాటు ప్రజల తరపున నిలవడం గొప్ప బాధ్యత లాగా భావించాలన్నారు. సమాజం నుండి ఎలాంటి వ్యక్తిగత అభివృద్ధి ఫలాలు ఆశించకుండా పనిచేస్తున్న జర్నలిస్టులను ఎంతో గౌరవించుకోవాల్సిన బాధ్యత సమాజంపై కాస్తయినా ఉందన్నారు.ప్రస్తుత సమాజాన్ని జర్నలిజం ప్రతిబింబిస్తుందని ప్రత్యేకంగా అభినందించారు. శనివారం 2025-26, జర్నలిజం విద్యార్థుల ఫ్రెషర్స్ పార్టీ కార్యక్రమం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగ అధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రొఫెసర్ సురేష్ లాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ జర్నలిజం విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ తో పాటు సృజనాత్మక శక్తిని కలిగి ఉండాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా తో పాటు, సోషల్ మీడియాలో కూడా స్కిల్స్ ఉన్నవారికి విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఇంగ్లీష్ స్కిల్స్ పెంపొందించుకునేందుకు విద్యార్థులకు కేయూ ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ మేఘన రావుతో మాట్లాడి మీకు అవకాశం ఇప్పిస్తానని సురేష్ లాల్ హామీ ఇచ్చారు. దూరవిద్య కేంద్రంలోని మీడియా సెంటర్ తో పాటు, ఎంబీఏ ల్యాబ్ కూడా జర్నలిజం విద్యార్థులు వినియోగించుకోవచ్చని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఇప్పుడిప్పుడే వినియోగంలోకి వస్తున్న కృత్రిమ మేధ పై కూడా జర్నలిజం విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని ప్రొఫెసర్ సురేష్ లాల్ సూచించారు. జర్నలిస్టులకు ప్రశ్నించే తత్వం ఉండాలన్నారు. సమకాలీన అంశాలపై జర్నలిజం విద్యార్థులు పత్రికల్లో ఆర్టికల్స్ రాయడంతో పాటు, రేడియోకు వ్యాసాలు కూడా రాయాలని, టీవీ, సినిమా, అడ్వర్టైజింగ్, ప్రజా సంబంధాలు లాంటి పలు రంగాల్లో జర్నలిజం విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ ప్రొఫెసర్ కుంట ఐలయ్య మాట్లాడుతూ జర్నలిజం విద్యార్థులు, జర్నలిస్టులు కాలంతో పాటు పనిచేయాలని సూచించారు. అవకాశాలను అందిపుచ్చుకోవడానికి జర్నలిజం విద్యార్థులు నిరంతరం శ్రమించాలన్నారు. వ్యవస్థలోని ప్రతి అంశాన్ని జర్నలిజం ప్రభావితం చేస్తుందని ప్రొఫెసర్ కుంట ఐలయ్య అన్నారు. జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ జర్నలిజం విద్యార్థులకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా లలో పూర్వ విద్యార్థులు అవకాశాలు పొందారాని చెప్పారు. బిబిసి, వి6, ఈ టీవీ ఛానల్ లలో మా పూర్వ విద్యార్థులు పనిచేస్తున్నారని మల్లేశ్వర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జర్నలిజం విభాగ అధ్యాపకులు కంజర్ల నరసింహా రాములు, డాక్టర్ వంగాల సుధాకర్, డాక్టర్ డి. శ్రీకాంత్ యాదవ్, డాక్టర్ ఎ. సంపత్ కుమార్, క్లర్క్ నీలం ప్రనూప్ కుమార్, రాజ్ కుమార్, నందిని, అనిల్, మౌనిక, సీనియర్ విద్యార్థులు ప్రశాంత్, కుమారస్వామి, శివాంజి, కావ్య, సారిక కృష్ణవేణి, గణేష్, జూనియర్ విద్యార్థులు రాజు, మౌనిక, రాహుల్, పవన్ కళ్యాణ్, స్వామి, నాగేంద్ర, రచన, తదితర విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# ఎంత ఎదిగిన ఉద్యమాలకు అతీతులమే

**నిజమైన ఉద్యమకారులకు గౌరవాలు లభిస్తూనే ఉంటాయి**
**తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర చైర్మన్‌గా డా.చిర్ర రాజు గౌడ్**
**పోరాటాలు మా హక్కు ఉద్యమాలు మా ఊపిరి**



**హైదరాబాద్ జై భీమ్ న్యూస్:-**

తెలంగాణ ఉద్యమకారుల సమావేశం శనివారం హైదరాబాద్ బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగింది ఈ సమావేశం తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డా.,పిడమర్తి రవి అధ్యక్షులు సమావేశం జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి పిలమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం పనిచేసిన ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇవ్వాలని,అలాగే ప్రతినెల పింఛన్, ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర నూతన కమిటీ చైర్మన్ గా డా.,చిర్ర రాజు గౌడ్ (కేయూను ఏకగ్రీవంగా ప్రకటించారు,రాష్ట్ర అధ్యక్షులుగా ఎండల ప్రదీప్ (టి.యూ),కన్వీనర్ గా యం.డి రహీమ్ (ఓ.యూ), కో - చైర్మన్ గా తోట హరీష్ ను ఏకగ్రీవంగా పెరమర్తి రవి ప్రకటించడం జరిగింది, అదే విధంగా కార్మిక సంఘం, మహిళా సంఘం, గో బ్యాక్ మార్వాడి సంఘం,రాష్ట్ర కమిటీలను ప్రకటించడం జరిగింది.

# టీటీడీకి కొత్త ఈవోగా ముద్దాడ రవిచంద్ర..

**సీఎం స్పెషల్ చీఫ్ సెక్రటరీగా కే. విజయానంద్**

**ఆంధ్ర ప్రదేశ్ జై భీమ్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐఏఎస్ అధికారులకు మరోసారి ముఖ్యమైన నియామకాలు, అదనపు బాధ్యతలు అప్పగించింది. తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) పూర్తిస్థాయి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)గా ముద్దాడ రవిచంద్రను నియమించగా, పదవీ విరమణ చేసిన కే. విజయానంద్ను ముఖ్యమంత్రి స్పెషల్ చీఫ్ సెక్రటరీగా తిరిగి నియమించారు. అలాగే ప్రస్తుత చీఫ్ సెక్రటరీ జి. సాయి ప్రసాద్కు రెండు శాఖలకు అదనపు బాధ్యతలు కట్టారు.

**ముద్దాడ రవిచంద్ర (1996 బ్యాచ్ ఐఏఎస్)**

ప్రస్తుతం ముఖ్యమంత్రికి స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేస్తున్న ముద్దాడ రవిచంద్రను టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించారు. గీ ఆడల్టరేషన్ కేసు నేపథ్యంలో మాజీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ బదిలీ అయిన తర్వాత ఈ నియామకం జరిగింది. రవిచంద్ర ఫిబ్రవరి 6, 2026న తిరుమలలో బాధ్యతలు స్వీకరించారు. శ్రీవారి ఆలయంలో భూవరాహస్వామివారిని దర్శించుకుని, సాంప్రదాయ రీత్యా ఆశీర్వచనాలు అందుకున్నారు. "భక్తుల సేవే మహద్భాగ్యం" అంటూ ఆయన భావోద్వేగాలు వ్యక్తం చేశారు.

**కే. విజయానంద్ (1992 బ్యాచ్ ఐఏఎస్)**

పదవీ విరమణ చేసిన తర్వాత కూడా ఆయన అనుభవాన్ని, సేవలను కొనసాగించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఆయనను "ఉద్యోగ రీత్యా" ముఖ్యమంత్రి స్పెషల్ చీఫ్ సెక్రటరీగా మళ్లీ నియమించారు. ఈ నియామకం ఒక సంవత్సరం పాటు లేదా తదుపరి ఆదేశాలు వచ్చే వరకు అమలులో ఉంటుంది. ముందు చీఫ్ సెక్రటరీగా పనిచేసిన అనుభవంతో ఆయన కీలక పాత్ర పోషిస్తారని అంచనా.

**జి. సాయి ప్రసాద్ (1991 బ్యాచ్ ఐఏఎస్)**

ప్రస్తుత చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్న జి. సాయి ప్రసాద్‌కు అదనపు బాధ్యతలుగా: జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రెవెన్యూ శాఖ (భూమి, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, రిజిస్ట్రేషన్ & స్టాంప్స్) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. ఫిబ్రవరి 28, 2026 నాటికి ఈ అదనపు ఛార్జీలు అమలులోకి వచ్చాయి. ఈ నియామకాలతో రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు, టీటీడీలో భక్తుల విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు, పరిపాలనా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించినట్లు కనిపిస్తోంది.

# కాకతీయ విశ్వవిద్యాలయంలో బొట్ల మహర్షి పుస్తక ఆవిష్కరణ

**యువతకు మార్గదర్శకం "ది ఏజ్ ఆఫ్ 14 టు 25"**
**రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం**



**వరంగల్, 28 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

ప్రముఖ రచయిత, సామాజికవేత్త బొట్ల మహర్షి రచించిన "ది ఏజ్ ఆఫ్ 14 టు 25 -- ప్రొటెక్ట్ యువర్ లైఫ్" పుస్తకాన్ని శనివారం వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఘనంగా ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. అఖిల భారత యూనివర్సిటీల సంఘం ఉపాధ్యక్షుడు పుల్లా శ్రీనివాస్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ 14 నుండి 25 సంవత్సరాల మధ్య వయస్సు యువతలో సామాజిక, సాంకేతిక, మానసిక మార్పులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. డ్రగ్స్, పోర్న్ సైట్లు, ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడటం వల్ల యువత తమ భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారని, ఇది తల్లిదండ్రులకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని అన్నారు. రచయిత బొట్ల మహర్షి ఈ పుస్తకంలో యువత ఎలా సక్రమ దారిలో నడవాలి, చట్టాలపై సరైన అవగాహన కలిగి ఉండటం ఎంత ముఖ్యమో వివరించారని చెప్పారు. చట్టాలు తెలియక చేసిన తప్పిదాలు నేరాలుగా మారి భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. యువత ఈ పుస్తకాన్ని చదివి అందులోని సూచనలను ఆచరణలో పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంగాల ఎఫ్రాయ్ రాజ్, బొల్లెపాక ప్రభాకర్, డాక్టర్ జెట్టి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో దొంగనోట్ల ముఠా గుట్టురట్టు

**రూ. 5.98 లక్షల నకిలీ కరెన్సీ స్వాధీనం - 12 మంది అరెస్ట్**



**లక్షెట్టిపేట, 28 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ కరెన్సీ చలామణి చేస్తున్న అంతరాష్ట్ర ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకుని రూ. 5,98,500 విలువైన నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 12 మందిని అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్ తెలిపారు. అదనంగా మూడు కార్లను సీజ్ చేశారు. ఫిబ్రవరి 25న ఉదయం ఒక తెలుపు రంగు కారు స్థానిక పెట్రోల్ బంక్‌కు వచ్చి రూ. 1,500 విలువైన ఇంధనం నింపించుకుని రూ. 500 చొప్పున మూడు నోట్లు చెల్లించి వెళ్లిపోయింది. బంక్ సిబ్బంది నోట్లను పరిశీలించగా వాటికి ఒకే సీరియల్ నంబర్ ఉండటం గమనించారు. వెంటనే మేనేజర్‌కు సమాచారం ఇచ్చి సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా వాహన నంబర్ సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంచిర్యాల డీసీపీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. దర్యాప్తులో నిందితులు కాకినాడకు వెళ్లి అక్కడి వ్యక్తుల నుంచి సుమారు రూ. 6 లక్షల నకిలీ కరెన్సీ సేకరించి లక్షెట్టిపేట ప్రాంతంలో చలామణి చేయడానికి ప్రయత్నించినట్లు వెల్లడైంది. వెంటనే చర్యలు తీసుకున్న పోలీసులు 12 మందిని అరెస్ట్ చేసి నకిలీ నోట్లు, మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ఇద్దరు నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. ప్రజలు నగదు లావాదేవీల సమయంలో నోట్లను జాగ్రత్తగా పరిశీలించాలని, అనుమానాస్పద నోట్లపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు.

# సైన్స్ మన దైనందిన జీవితానికి మార్గదర్శి

**ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ జి. సీతారాం**



**హన్మకొండ, 28 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

జనగామ పట్టణంలోని ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల కోసం వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. సీతారాం మాట్లాడుతూ, సైన్స్ అనేది మన దైనందిన జీవితంలో అత్యంత కీలకమైన అంశమని పేర్కొన్నారు. ప్రపంచాన్ని శాస్త్రీయ దృష్టితో అర్థం చేసుకుని ముందుకు నడిపించే శక్తి సైన్స్‌కే ఉందని ఆయన అన్నారు. మేరా యువభారత్ వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, సూపరింటెండెంట్ బానోత్ దేవిలాల్ ఆదేశాల మేరకు కళాశాలలో వ్యాసరచన మరియు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు స్వయంగా తయారు చేసిన పలు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. సోలార్ పవర్ ఇరిగేషన్, భూకంప అలారం, ఎయిర్ పొల్యూషన్ నియంత్రణ వంటి ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ విధమైన వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని, సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశమని ప్రిన్సిపల్ తెలిపారు. నోబెల్ బహుమతి గ్రహీత సి.వి. రామన్ పరిశోధనల నుంచి ప్రేరణ పొందుతూ విద్యార్థులు కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ఆయన పిలుపునిచ్చారు. పోటీలలో ఎం. సౌమ్య మొదటి బహుమతి, సింగారపు రమ్య రెండవ బహుమతి, భాగ్యశ్రీ తృతీయ బహుమతి సాధించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పరమేశ్వర్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మండ రాజేష్ గౌడ్, ఫిజిక్స్ విభాగాధిపతి ఆయుబ్ ఖాన్, అధ్యాపకులు పావని, ముంతాజ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలకు దారితీస్తూ సృజనాత్మకతకు నాంది పలికింది.

# పాథ్‌ఫైండర్ హై స్కూల్‌లో విజ్ఞాన ప్రదర్శన విజయవంతం

**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**




మండల కేంద్రంలోని పాథ్‌ఫైండర్ హై స్కూల్‌లో విజ్ఞాన ప్రదర్శన (సైన్స్ ఫెయిర్)ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత మరియు ఆవిష్కరణా చింతనను పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.పాఠశాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, పునర్వినియోగ శక్తి వనరులు, రోబోటిక్స్, అంతరిక్ష శాస్త్రం, ఆరోగ్య అవగాహన వంటి వివిధ అంశాలపై రూపొందించిన నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థుల ప్రతిభ, పరిశోధనా నైపుణ్యం అందరినీ ఆకట్టుకుంది.పాఠశాల డైరెక్టర్ ఎన్ వెంకటేశ్వర్ రావు విద్యార్థులను అభినందించి, శాస్త్రీయ ఆలోచనలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ యండి సుభానోద్దీన్ ఉపాధ్యాయులను అభినందించి, కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.తల్లిదండ్రులు మరియు అతిథులు విద్యార్థుల ప్రదర్శనలను ప్రశంసించారు. విజ్ఞాన ప్రదర్శన కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# మంచాల రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శించిన ఆరూరి రమేష్

**దమ్మన్నపేటలో విషాదం మాజీ ఎమ్మెల్యేల సానుభూతి.**

**-చిన్నాల రంగయ్య భౌతికదేహానికి నివాళులు.**




**ఫిబ్రవరి 28 జై భీమ్ ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట)**

వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన యువజన నాయకుడు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ మంచాల రాజశేఖర్ తాతగారైన చిన్నాల రంగయ్య అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్, నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నాల రంగయ్య భౌతికదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన వారు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిన్నాల రంగయ్య గ్రామంలో అందరికీ ఆప్తుడని, ఆయన మరణం తీరని లోటని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫర్టిలైజర్ రాష్ట్ర చైర్మన్ సభ్యులు నాగూర్ల వెంకన్న, మండల పార్టీ అధ్యక్షులు తుళ్ళ కుమారస్వామి, గ్రామ మాజీ సర్పంచ్ అర్జున మంగా తిరుపతి రెడ్డి, మాజీ ఎంపీపీ నూనె బిక్షపతి, గ్రామ పార్టీ అధ్యక్షులు సమ్మయ్య, సీనియర్ నాయకులు తుమ్మల యాకయ్య, పిట్టల రాజు, సర్పంచ్ అభ్యర్థి గడ్డం రాజు, గడ్డం అశోక్, ఉద్యమ నాయకులు రాజశేఖర్, మాజీ సర్పంచులు బాలికల రాజాలు, మహేశ్వరం వేణు, అంకేశ్వరపు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో పలువురు ప్రజలు హాజరై చిన్నాల రంగయ్యకు చివరి నివాళులు అర్పించారు.

# విద్యార్థుల సృజనాత్మకతకు వేదికగా సైన్స్ ఎక్స్‌పో

**వర్ధన్నపేటలో శ్రీ అరవిందో హై స్కూల్‌లో ఘనంగా నిర్వహణ.**

**ఆకట్టుకున్న శాస్త్రీయ నమూనాలు**




**ఫిబ్రవరి 28 జై భీమ్ ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట)**

వర్ధన్నపేట పట్టణంలోని శ్రీ అరవిందో హై స్కూల్‌లో శుక్రవారం సైన్స్ ఎక్స్‌పోను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం విశేష స్పందనను పొందింది. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పోలో విద్యార్థులు స్వయంగా రూపొందించిన వివిధ శాస్త్రీయ నమూనాలు, వినూత్న ప్రాజెక్టులు, సృజనాత్మక ప్రదర్శనలు సందర్శకులను మంత్రముగ్ధులను చేశాయి. పర్యావరణ పరిరక్షణ, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి విధానాలు, స్మార్ట్ సిటీ నమూనాలు, వ్యవసాయంలో సాంకేతిక వినియోగం వంటి అంశాలపై రూపొందించిన ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థుల్లో పరిశోధనాత్మక ఆలోచన, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడమే ఈ సైన్స్ ఎక్స్‌పో లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రముఖులు పాల్గొని విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ప్రదర్శనలో ఉత్తమ ప్రాజెక్టులకు బహుమతులు అందజేశారు. సైన్స్ ఎక్స్‌పోను విజయవంతంగా నిర్వహించిన శ్రీ అరవిందో హై స్కూల్ యాజమాన్యాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీహరబిందో హై స్కూల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్ సింగ్ దీన్ వీరన్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# స్ఫూర్తి సైన్స్ ఫెయిర్‌తో శాస్త్ర చైతన్యం

**నర్సంపేట మైనార్టీ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం.**

**14416 టెలిమానస్ ద్వారా మానసిక సహాయం.**

**డీఎంహెచ్ఓ,డా"బి.సాంబశివరావు**

**ఫిబ్రవరి 28 జై భీమ్ ప్రతినిది: (వరంగల్)**

కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ వరంగల్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు నేడు నర్సంపేటలోని మైనార్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికల)లో నిర్వహించిన "స్ఫూర్తి" సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థినీ విద్యార్థులే భావి భారత పౌరులని, వారికి శారీరక--మానసిక దృఢత్వం, శాస్త్రీయ దృక్పథం, ఆర్థిక సమస్యలపై అవగాహన, ఆరోగ్యం పౌష్టికాహారం అలవాటు ఉంటేనే మంచి పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. విద్యార్థులు స్వీయ అవగాహన పెంపొందించుకుని, నైపుణ్యాలు సాధించి, తోటి వారిపై సానుభూతితో వ్యవహరిస్తూ సమస్యలను తర్కబద్ధంగా పరిష్కరించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. భావవ్యక్తీకరణ సరళంగా, సృజనాత్మకతతో ఉండాలని, తర్కబద్ధమైన ఆలోచనలు పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని గౌరవంగా జరుపుకుంటున్నందుకు అభినందనలు తెలియజేస్తూ, శాస్త్ర--సాంకేతిక అభివృద్ధి ద్వారానే దేశ ప్రగతి సాధ్యమని వివరించారు. డిప్యూటీ మాస్ మీడియా అధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు సమాజంలో ప్రభావం చూపిన మహానుభావుల జీవితాల నుంచి స్ఫూర్తి పొంది తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ వయసులోనే లక్ష్యాలను నిర్దేశించుకుని కుటుంబం, దేశ బాధ్యతల్లో భాగస్వాములు కావాలని కోరారు. విద్యార్థులు పరీక్షలు లేదా వ్యక్తిగత సమస్యల కారణంగా మానసిక ఒత్తిడికి లోనవకుండా, ఎలాంటి ఉద్వేగాలకు లోనుకాకుండా ప్రతి సమస్యకు పరిష్కారం అన్వేషించాలని సూచించారు. సూసైడ్ అటెంప్ట్‌లకు దూరంగా ఉండాలని, అవసరమైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితుల సలహాలు తీసుకోవాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ టెలిమానస్ కార్యక్రమం ద్వారా మానసిక కౌన్సిలింగ్ అందించడానికి సిద్ధంగా ఉందని, ఎవరైనా సమస్యలు ఉంటే 14416 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమం అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గౌరవ అతిథులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీపాల, ఉపాధ్యాయులు, సిసి నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.




# పెరికేడు జడ్పీహెచ్ఎస్‌లో విజ్ఞానోత్సవం

**విద్యార్థుల సృజనాత్మక ఆవిష్కరణలు ఆకట్టుకున్న సైన్స్ డే వేడుకలు.**

**ఫిబ్రవరి 28 జై భీమ్ ప్రతినిది: (వరంగల్ /రాయపర్తి)**




మండలంలోని పెరికేడు జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ వివిధ సైన్స్ ఆవిష్కరణలను ప్రదర్శించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలు, ప్రయోగాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రతి ఆవిష్కరణ పనితీరు, దాని ఉపయోగాలను తోటి విద్యార్థులకు స్పష్టంగా వివరించి విజ్ఞానంపై ఆసక్తిని పెంచారు. మానవ అవయవాల చిత్రాలను రంగవల్లులతో నేలపై అందంగా చిత్రించి చూపరుల ప్రశంసలు అందుకున్నారు.గ్రామ యువత, ప్రజలు సైన్స్ ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు నరేందర్, వెంకటేశ్వర్లు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# వర్ధన్నపేట మైనార్టీ పాఠశాలలో నేషనల్ సైన్స్ డే సందడి

**విద్యతో పాటు శాస్త్ర విజ్ఞానం అలవరచుకోండి**

**డ్రగ్స్ మాయలో పడొద్దని విద్యార్థులకు జడ్జి వీబీ నిర్మలా గీతాంబ సూచన**

**ఫిబ్రవరి 28 జై భీమ్ ప్రతినిధి: (వరంగల్ /వర్దన్నపేట)**




వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని మైనారిటీ స్కూల్‌లో నేషనల్ సైన్స్ డే సందర్భంగా ప్రత్యేక సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా లీగల్ సర్వీస్ జడ్జి వీబీ నిర్మలా గీతాంబ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా శాస్త్ర విజ్ఞానాన్ని సైతం అలవరచుకోవాలని సూచించారు. ఈనాటి విద్యార్థులే రేపటి భావితరాలకు మార్గదర్శకులుగా, శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. దేశ అభివృద్ధికి శాస్త్ర సాంకేతిక రంగం కీలకమని, విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటేనే సమాజ పురోగతి సాధ్యమని పేర్కొన్నారు. అలాగే యువతను వేధిస్తున్న డ్రగ్స్ సమస్యపై తీవ్రంగా స్పందిస్తూ, మత్తు పదార్థాలు జీవితాన్ని నాశనం చేసే మహమ్మారి వంటివని హెచ్చరించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. చట్టపరమైన పరిరక్షణలతో పాటు కుటుంబం, గురువుల మార్గదర్శనం అవసరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మైనారిటీ స్కూల్ ప్రిన్సిపాల్, ఎంపీడీవో వెంకటరమణ, సీఐ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

# ఉప ముఖ్యమంత్రి భట్టి కుమారుని పెళ్లికి ప్రత్యేక ఆహ్వానం

**నల్లబెల్లి సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్‌కు ఆహ్వాన పత్రిక అందజేత.**

**ఫిబ్రవరి 28 జై భీమ్ ప్రతినిది: (వరంగల్ /వర్దన్నపేట)**




మల్లు భట్టి విక్రమార్క కుమారుడు సూర్యవిక్రమాదిత్య వివాహ వేడుక మార్చి 5న హైదరాబాద్‌లో ఘనంగా జరగనుంది. ఈ నేపథ్యంలో వివాహ ఆహ్వాన కార్యక్రమాలు వేగవంతమయ్యాయి. వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ కి ప్రత్యేక ఆహ్వానం అందింది. వారి నివాసంలో విద్యుత్ శాఖ అధికారి రమణరెడ్డి మర్యాదపూర్వకంగా కలసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ ఉప ముఖ్యమంత్రి కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వివాహ వేడుకకు హాజరవుతానని తెలిపారు. మార్చి 5న హైదరాబాద్‌లో జరిగే ఈ వివాహ వేడుకకు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు హాజరుకానున్నారు.

# నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ




**మహబూబాబాద్, జై భీమ్ న్యూస్**

మహబూబాబాద్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈరోజు జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆధ్వర్యంలో క్రైమ్ రివ్యూ సమావేశం నిర్వహించారు . ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు , సబ్ ఇన్‌స్పెక్టర్లు మరియు ఇతర పోలీసు సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న హత్య కేసులు, దొంగతన కేసులు మరియు ఇతర ఆస్తి సంబంధిత కేసులపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నేరస్తులను త్వరితగతిన పట్టుకుని కేసుల విచారణలో నాణ్యతను పెంచి, శిక్షా శాతం మరింత మెరుగుపర్చాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన మున్సిపల్ చైర్మన్ మరియు వైస్ చైర్మన్ ఎన్నికలను పోలీసులు విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో అధికారులు మరియు సిబ్బంది చేసిన కృషిని జిల్లా ఎస్పీ అభినందించారు. అలాగే జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో కూడా "అరైవ్ అలైవ్" అవగాహన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాల పాటింపు మరియు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇంకా విజిబుల్ పోలీసింగ్, కమ్యూనిటీ పోలీసింగ్ వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి, ప్రజలకు పోలీసులపై నమ్మకం పెంచే విధంగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లాలో వివిధ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చేసి, మంచి పనితీరు కనబరిచిన అధికారులు మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రశంసించి, వారికి రివార్డులు అందజేశారు. జిల్లాలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి, జిల్లాను నేరరహితంగా మార్చేందుకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్ సూచించారు.

# ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తుతో త్వరితగతిన పూర్తి చేయాలి






**విసిబుల్ పోలీసింగ్‌తో నేరాల నియంత్రణ విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్.**

**భూపాలపల్లి. జై భీమ్ న్యూస్**

శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ ఆధ్వర్యంలో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్, నాన్-గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ, మిస్సింగ్ కేసుల వివరాలను సమగ్రంగా సమీక్షించారు. ప్రతి కేసులో నాణ్యమైన, వేగవంతమైన దర్యాప్తు జరగాలని, బాధితులకు న్యాయం అందించడంలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని స్పష్టం చేశారు. అత్యాచార, పోక్సో కేసులను నిర్ణీత గడువుల్లో పూర్తి చేసి నిందితులను కోర్టు ముందు నిలపాలని ఆదేశించారు. జిల్లాలో లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేసి అమలు చేయాలని, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు పెండింగ్‌లో ఉన్న కేసులను తక్షణమే పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పురోగతి సాధించాలని, సీసీ కెమెరాల వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విసిబుల్ పోలీసింగ్ అమలు చేస్తూ ప్రతిరోజూ వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓపికగా విని, సమయానుకూలంగా స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐలు, ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# రక్షణాత్మక డ్రైవింగ్‌ను అలవారుచుకోవాలి

**మడికొండ సిఐ పుల్యాల కిషన్**



**మడికొండ.జై భీమ్ న్యూస్**

తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివదర్ రెడ్డి ఐపీస్ ఆదేశాల మేరకు వరంగల్ పోలీస్ కమీషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపీస్ సూచనలప్రకారం మడికొండ పోలీస్ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ రహదారి భద్రతకు సంబంధించి డీజీపీ శివదర్ రెడ్డి ప్రవేశపెట్టిన లిఅర్రైవ్ అలీవ్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజ్ మడికొండ నందు సుమారు 300 మంది విద్యార్థులకు రక్షణాత్మక డ్రైవింగ్ ను గురించి వివరించడం జరిగింది. ఇందులో భాగంగా మడికొండ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ మాట్లడుతూ తెలంగాణ పోలీస్ డీజీపీ ఒక చక్కని ఉద్దేశ్యంతో అర్రైవ్ అలీవ్ ప్రోగ్రామ్ రూపొందిచారు. రక్షణాత్మక డ్రైవింగ్ ముఖ్య ఉద్దేశ్యం మనల్ని మనం రోడ్డు ప్రమాదాలనుండి కాపాడుకోవడం కోసం అని తెలిపి డ్రైవింగ్ చేసేటప్పుడు చుట్టూ పరిసరాలను జాగ్రత్తగా గమనిస్తూ డ్రైవ్ చేయాలనీ,ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే చూసుకుని ఆగాలని ఎదురుగా వచ్చే వ్యక్తి ఎలా డ్రైవ్ చేస్తున్నాడో గమనించాలని మెయిన్ రోడ్డు నుండి గల్లీల్లోకి పోయే రోడ్ల మీద జాగ్రత్తగా ఉండాలని, టర్న్ చేసేటపుడు ఇండికేటర్ వాడాలని పెద్ద లోడ్ వాహనాలు వెళ్తున్నప్పుడు దూరంగా వెళ్లాలని తెలిపారు. డిఫెన్స్ డ్రైవింగ్ ముఖ్య ఉద్దేశం మనం ఎంత జాగ్రత్తగా వెళ్లిన ఎదురు వచ్చేవాడు చేసిన తప్పులనుండి మనల్ని మనం కాపాడుకుంటూ గమ్యస్థానం చేరాలని తెలిపారు.

# అంతర్రాష్ట్ర నకిలీ కరెన్సీ ముఠాను బయటపెట్టింది




**రామగుండం, జై భీమ్ న్యూస్**

రామగుండం పోలీస్ కమిషనరేట్ లక్షెట్టిపేట్ పరిధిలో అంతర్రాష్ట్ర నకిలీ కరెన్సీ ముఠాను బయటపెట్టింది. ఈ ముఠా సభ్యులు 12 మందిని అరెస్టు చేసి, రూ. 5,98, 500 విలువైన నకిలీ నోట్లను స్వాధీనం చేసుకుంది. అదనంగా మూడు కార్లను కూడా సీజ్ చేశారు. ఇద్దరు నిందితులు ఇంకా పరారీలో ఉన్నారు. ఫిబ్రవరి 25, 2026న ఉదయం 11 గంటల సమయంలో లక్షెట్టిపేట్‌లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌కు తెలుపు రంగు కారు (TS19TG 9158) వచ్చింది. ఆ కారులోని వ్యక్తులు రూ. 1,500 విలువైన పెట్రోల్ నింపించుకుని, రూ. 500 చొప్పున మూడు నోట్లు ఇచ్చి వెళ్లిపోయారు. పెట్రోల్ బంక్ ఉద్యోగి వెంకటేట్టి మమత ఆ నోట్లను జాగ్రత్తగా పరిశీలించగా, మూడు నోట్లకూ ఒకే సీరియల్ నంబర్ (9FV 230854) ఉండటం గమనించారు. వెంటనే మేనేజర్ నయీమ్‌కు తెలియజేసి, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా వాహన వివరాలు సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో లక్షెట్టిపేట్ పోలీస్ స్టేషన్‌లో జతీ. చీశీ. 61/26 ఖ/గా 179, 180, 318(4) దీచీూ కింద కేసు నమోదైంది. మంచిర్యాల డీసీపీ ఆదేశాల మేరకు, ఏసీపీ పర్యవేక్షణలో లక్షెట్టిపేట్ సీఐ డి. రమణమూర్తి, ఎస్ఐ జి. సురేష్, దండేపల్లి ఎస్ఐ తహసీనుద్దీన్‌లతో పాటు ప్రత్యేక బృందం ఏర్పాటై దర్యాప్తు చేపట్టింది. దర్యాప్తులో నిందితులు (ూ-1 నుంచి ూ-6 వరకు) కాకినాడలోని ూ-13 రాము, ూ-14 రవి వద్ద నుంచి సుమారు రూ.6 లక్షల నకిలీ కరెన్సీ తీసుకుని, లక్షెట్టిపేట్ ప్రాంతంలో చలామణి చేయడానికి ప్రయత్నించినట్లు తేలింది. పోలీసులు వెంటనే చర్యలు తీసుకుని 12 మంది నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 5,98,500 విలువైన నకిలీ నోట్లు, మూడు వాహనాలు జప్తు చేశారు. కానుగంటి క్రాంతి (30, రియల్ ఎస్టేట్ వ్యాపారం, ఇటిక్యాల్) గాడిగొప్పుల రవీందర్ (40, ఆటో డ్రైవర్, ఇటిక్యాల్) తాండ్ర ప్రకాష్ (36, కూలీ, శ్రీరాంపూర్) కోన మధుకర్ (27, డ్రైవర్/వ్యవసాయం, వెంకట్రావుపేట) సుంక సురేష్ కుమార్ (39, వ్యాపారం, గోదావరిఖని) కమాని అనిల్ (40, వస్త్ర దుకాణం, సుల్తానాబాద్) బండారి సత్య నారాయణ (35, కిరాణా దుకాణం, రంగపేట) ఐ. హెచ్. రాము నాయక్ (30, బేకరీ వ్యాపారం, లక్షెట్టిపేట్) కందిమల్ల తిరుపతి (50, వ్యవసాయం, జెండా వెంకటపూర్) గొల్ల కుమారస్వామి (30, వ్యవసాయం, పెరికపల్లి) నగునూరి రాము (40, పాల వ్యాపారం, లక్షెటిపేట్) దేవనబోయిన సంపత్ కుమార్ (34, రైతు, తిమ్మయ్యపల్లి) పరారీలో ఉన్నవారు: ూ-13: రాము (కాకినాడ) ూ-14: రవి (కాకినాడ) మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్ ఈ వివరాలను పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించారు. చాకచక్యంగా వ్యవహరించిన పోలీస్ బృందాన్ని ఏసీపీ, డీసీపీ అభినందించారు. ప్రజలు నకిలీ నోట్లను గుర్తించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.



# సెంట్ మేరీ'స్ హై స్కూల్ లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా

## వేస్ట్ టు బెస్ట్ ఎగ్జిబిట్స్‌తో ఆకట్టుకున్న విద్యార్థులు




**హసన్‌పర్తి, 28 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తారు. శాస్త్రవేత్తల కృషిని స్మరించుకుంటూ, శాస్త్రీయ ఆలోచనలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా హసన్‌పర్తి మండల కేంద్రంలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో సైన్స్ డే సంబరాలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు "వేస్ట్ టు బెస్ట్" అనే అంశంపై వినూత్న ఎగ్జిబిట్స్‌ను తయారు చేసి తమ ప్రతిభను చాటుకున్నారు. ఇంటి పరిసరాలలో లభించే వ్యర్థ పదార్థాలు, పాత ప్లాస్టిక్ వస్తువులు, కార్డ్‌బోర్డ్, పేపర్, బాటిళ్లు వంటి సామగ్రిని వినియోగించి ఉపయోగకరమైన నమూనాలను రూపొందించారు. పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, గాలి కాలుష్య నియంత్రణ, పునర్వినియోగ శక్తి వనరులు వంటి అంశాలపై రూపొందించిన నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు తమ ఎగ్జిబిట్స్ ద్వారా వ్యర్థాలను సక్రమంగా వినియోగిస్తే అవి సమాజానికి ఉపయోగపడే వనరులుగా మారుతాయని వివరించారు. ముఖ్యంగా గాలి, నీరు మరియు సహజ వనరుల ప్రాముఖ్యతను తెలియజేస్తూ పర్యావరణ హిత పద్ధతులను సందర్శకులకు వివరిస్తూ ప్రశంసలు అందుకున్నారు. ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా సృజనాత్మక ఆలోచనలతో రూపొందించిన నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ తిరుమలేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. శాస్త్రంపై ఆసక్తి పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చూపుతున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. సైన్స్ ఉపాధ్యాయులతో పాటు ఇతర ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించి, ఎగ్జిబిట్స్ తయారీలో చురుకుగా సహకరించారు. ఎగ్జిబిట్స్ రూపకల్పనలో తమ సూచనలు, సలహాలు అందించిన ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వెలిగేటి కల్పనా రెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, ఎలుక రాజు సదానందం, ఉపాధ్యాయులు జహంగీర్, రాజేంద్రప్రసాద్, అంజద్, సంపత్, విజయ రాణి, ప్రియాంక, లలిత రాజపుత్, లత రెడ్డి, రజిని, అనురాధ, సంధ్యారాణి, సంధ్యతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంలో ముఖ్య పాత్ర పోషించింది.

# పదవి విరమణ పొందిన ఎస్ఐ రాంసింగ్ కి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు



**ములుగు. జై భీమ్ న్యూస్**

పోలీస్ డిపార్ట్మెంట్లో తమ 35 సం.ల సర్వీస్ పూర్తి చేసుకుని ఈరోజు పదవీ విరమణ చేసిన వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ రూమ్ నందు విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ రాంసింగ్ కి జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయం లో ములుగు జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్, ఐపీఎస్ శాలువా కప్పి, జ్ఞాపికను బహూకరించి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్, ఐపీఎస్ మాట్లాడుతూ వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ రాంసింగ్ పోలీస్ డిపార్ట్మెంట్లో సుదీర్ఘంగా సేవలందించి సర్వీస్ పూర్తి చేసుకుని ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందినారని శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీస్ విభాగంలో సుధీర్ఘ కాలంగా విధులు నిర్వహించి పదవీవిరమణ చేసిన సిబ్బంది సేవను మరువమని, పదవీవిరమణ చేసిన మీరు పోలీస్ కుటుంబంలో ఎలాంటి సమస్య వచ్చిన తనను సంప్రదించ వచ్చని అన్నారు ప్రతి ఉద్యోగికి జీవితంలో రిటైర్ మెంట్ అనేది ఒక ముఖ్య ఘట్టమని, అది వారి జీవితంలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని" అని అన్నారు. విధి నిర్వహణలో పగలనక, రాత్రనక, పండగల సమయంలో భార్యా,పిల్లలకు దూరంగా ఉండి విధులు నిర్వహించినారు. పదవి విరమణ చేసిన పోలీసులు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావిజీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ బి ఇన్స్పెక్టర్ శంకర్, ఆర్ఐ వెంకటనారాయణ, వెంకటాపూర్ ఎస్సై రాజు, పదవి విరమణ పొందిన రాంసింగ్ గారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# శ్రీవారి దర్శనానికి ఎంత సమయం పడుతోందంటే..!

**తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ**
**సర్వదర్శనానికి 15 గంటల సమయం అంచనా**
**నిన్న శ్రీవారిని దర్శించుకున్న 67,952 మంది భక్తులు**
**హుండీ ద్వారా రూ. 3.97 కోట్ల ఆదాయం**

**తిరుమల, జై భీమ్ న్యూస్**

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు స్వామివారి దర్శనానికి సుమారు 15 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోవడంతో, భక్తుల క్యూలైన్లు వెలుపల ఉన్న కృష్ణతేజ గెస్ట్ హౌస్ వరకు బారులు తీరాయి. టీటీడీ విడుదల చేసిన వివరాల ప్రకారం, శుక్రవారం (ఫిబ్రవరి 27) ఒక్కరోజే 67,952 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 27,414 మంది తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.97 కోట్లుగా నమోదైనట్లు టీటీడీ వెల్లడించింది.



# శ్రీవారి సన్నిధిలో అడివి శేష్, మృణాల్ ఠాకూర్

యంగ్ హీరో అడివి శేష్, నటి మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'డకాయిట్'. ఈ సినిమా ప్రమోషన్లను చిత్రబృందం ఆధ్యాత్మికంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా అడివి శేష్, మృణాల్ ఠాకూర్ శనివారం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయ వస్త్రధారణలో ఆలయానికి వచ్చిన ఈ జంట, తమ సినిమా విజయవంతం కావాలని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా అడివి శేష్ మాట్లాడుతూ... "ప్రతి సినిమా ఒక నమ్మకంతో చేసే ప్రయత్నమే. ఏళ్ల తరబడి కష్టపడి ఒక సినిమాను ప్రేక్షకుల చేతిలో పెడతాం. తిరుపతిలో ఈ ప్రయాణాన్ని ప్రారంభించడం సరైనదిగా అనిపించింది. ప్రమోషన్ల హడావుడిలోకి అడుగుపెట్టే ముందు కృతజ్ఞతతో ఆశీస్సులు తీసుకోవడం మాకు ముఖ్యం" అని తెలిపారు. అంతకుముందు తన మరో సినిమా విడుదల సందర్భంగా వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని కూడా శేష్ దర్శించుకున్నారు. ఇటీవలే 'డకాయిట్' చిత్రం నుంచి 'రూబరూ' అనే రొమాంటిక్ పాటను విడుదల చేశారు. ఈ పాట గురించి శేష్ మాట్లాడుతూ... "సినిమాలోని భావోద్వేగాలను, పాత్రల మధ్య ఉన్న సున్నితమైన సంబంధాన్ని 'రూబరూ' పాట ఆవిష్కరిస్తుంది. అందుకే ఈ పాటతో ప్రమోషన్లు ప్రారంభించాం. ఈ చిత్రాన్ని ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని వివరించారు. 'డకాయిట్' చిత్రానికి షానియేల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ కీలకమైన ప్రతినాయకుడి పాత్రలో నటిస్తుండగా, ప్రకాశ్ రాజ్, సునీల్, అతుల్ కులకర్ణి, జైన్ మేరీ ఖాన్, కామాక్షి భాస్కర్ల ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. తనను మోసం చేసిన మాజీ ప్రియురాలిపై ప్రతీకారం తీర్చుకోవాలనుకునే ఒక ఖైదీ కథే ఈ చిత్రం. ప్రేమ, ద్రోహం, పగ వంటి అంశాలతో ఈ సినిమా ఎమోషనల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోంది. తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో చిత్రీకరించిన ఈ చిత్రానికి అడివి శేష్, షానియేల్ డియో కలిసి కథ, స్క్రీన్‌ప్లే అందించారు. ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమా, త్వరలో పాన్-ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# 'ది కేరళ స్టోరీ 2' చిత్రం విడుదలకు మార్గం సుగమం..



### స్టే ఎత్తివేసిన హైకోర్టు డివిజన్ బెంచ్

'ది కేరళ స్టోరీ 2' సినిమా విడుదల కాకుండా కేరళ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను డివిజన్ బెంచ్ ఎత్తివేసింది. దీంతో ఈ చిత్రం విడుదలకు మార్గం సుగమమైంది. ఈ చిత్రం విడుదల కాకుండా హైకోర్టు సింగిల్ బెంచ్ ఇటీవల స్టే ఇచ్చింది. సీబీఎఫ్‌సీ తీరును తప్పుబడుతూ సినిమాను పునఃపరిశీలించాల్సిందిగా ఆదేశించింది. 15 రోజుల పాటు సినిమాపై స్టే విధించింది. సింగిల్ బెంచ్ తీర్పును చిత్ర నిర్మాత కేరళ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో సవాల్ చేశారు. ఈరోజు సాయంత్రం వరకు ఇరువర్గాల తరఫున సుదీర్ఘ వాదనలు విన్న జస్టిస్ సుశ్రుత్ అరవింద్ ధర్మాధికారి, జస్టిస్ పీవీబాలకృష్ణన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను ఎత్తివేసింది. 2023లో విడుదలైన 'ది కేరళ స్టోరీ' చిత్రానికి సీక్వెల్ 'ది కేరళ స్టోరీ 2' రూపొందింది. దీనికి కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించగా, విపుల్ అమృత్ లాల్ షా నిర్మించారు. ఉల్కా గుప్త, అదితి బాటియా, ఐశ్వర్య ఓజా ఈ చిత్రంలో నటించారు. నిజ జీవితంలో జరిగిన అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు చెబుతున్నారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 27న విడుదల చేస్తామని చిత్ర బందం ప్రకటించగా, సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుతో వాయిదా పడింది. ఈరోజు డివిజన్ బెంచ్ తీర్పుతో ఈ సినిమా విడుదలకు అడ్డంకులు తొలగిపోయాయి.



# సోషల్ మీడియాలో 'విరోష్' సునామీ..

టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తమ పెళ్లి ఫొటోలతో సోషల్ మీడియాలో సరికొత్త చరిత్ర సృష్టించారు. ఈ నెల 26న ఉదయ్‌పూర్‌లో అంగరంగ వైభవంగా ఒక్కటైన ఈ జంట, తమ వివాహ చిత్రాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకోగా లైకుల వర్షం కురుస్తోంది. ఈ పోస్ట్ కేవలం 24 గంటల్లోనే భారతీయ సెలబ్రిటీల పెళ్లిళ్ల రికార్డులన్నింటినీ తిరగరాసి, సోషల్ మీడియాలో వారికున్న అసాధారణమైన క్రేజ్‌ను మరోసారి నిరూపించింది. ఇప్పటివరకు బాలీవుడ్ జంట కియారా అద్వానీ-సిద్ధార్థ్ మల్హోత్రా పెళ్లి ఫొటోలకు వచ్చిన 16 మిలియన్ల లైక్సే అత్యధిక రికార్డుగా ఉండేది. అయితే, 'విరోష్' (విజయ్-రష్మిక) జంట ఈ మైలురాయిని కేవలం 14 గంటల్లోనే దాటేసి సంచలనం సృష్టించింది. ప్రస్తుతం వీరి పోస్ట్ 23.3 మిలియన్ల లైక్స్‌తో దూసుకుపోతోంది. దీంతో అలియా భట్-రణబీర్ కపూర్ (13 మిలియన్‌ం), సమంత-నాగ చైతన్య (12 మిలియన్‌ం), కత్రినా కైఫ్-విక్కీ కౌశల్ (10 మిలియన్‌ం), దీపికా పదుకొనే-రణవీర్ సింగ్ (8 మిలియన్‌ం) వంటి స్టార్ కపుల్స్ రికార్డులను ఈ జంట అధిగమించింది. ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగితే విరాట్ కోహ్లీ వ్యక్తిగత పోస్ట్ రికార్డుకు కూడా చేరువయ్యే అవకాశం కనిపిస్తోంది. దాదాపు ఎనిమిదేళ్ల రహస్య ప్రేమ ప్రయాణానికి ముగింపు పలుకుతూ ఒక్కటైన ఈ జంటకు అభిమానులు, సినీ ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. "నా బెస్ట్ ఫ్రెండ్‌ను భార్యగా చేసుకున్నాను" అని విజయ్, "నాకు నిజమైన ప్రేమను పరిచయం చేసిన వ్యక్తి" అని రష్మిక పెట్టిన ఎమోషనల్ క్యాప్షన్లు నెటిజన్లను మరింతగా ఆకట్టుకున్నాయి. వీరి పెళ్లి ఫొటోలు టాలీవుడ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్నాయి. ఉదయ్‌పూర్ వేడుకల అనంతరం మార్చి 4న హైదరాబాద్‌లో జరగనున్న గ్రాండ్ వెడ్డింగ్ రిసెప్షన్‌కు సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు భారీ సంఖ్యలో హాజరుకానున్నట్లు తెలుస్తోంది.